చిన్నమాట

పెద్దాడ ప్రకాష్

> తూటాలా ఆ మాట
> చాలా చిన్నది!
> కానీ అది చేసిన గాయం
> ఎంతో పెద్దది!!

చిన్నమాట—
ఒకే ఒక్క చిన్నమాట.
అది గుండెను రెండుగా చీలుస్తుందని, అంత చిన్నమాట మారణాయుధమై సెగలు పొగలు కక్కుతుందని ఇప్పుడే తెలిసింది పరమేశానికి.
మాట విషం చిమ్మగలదని అనేమాట మతే పోగొట్టగలదని అనుభవపూర్వకంగా అర్థం చేసుకున్నాడతడు.
ఆ ఒక్కమాటతో ఉండేలు దెబ్బతిన్న పక్షిలా విలవిలాడుతున్నాడతడు.
అతని చిన్నగుండె మహా శ్మశానంలా మండిపోతోంది.
తనే ఇంత ఇదయిపోతుంటే తనలోని సగభాగం—తన అర్ధాంగి పూర్ణ ఎంతలా కుమిలిపోతుందో?
ఆ ఊహకే అతడు గిజగిజలాడిపోయాడు.
తొమ్మిది నెలలు గర్భకోశంలో పదిలంగా దాచి నొప్పులు పడి జన్మ ఇచ్చిన తనయుడే అంతమాటంటే ఆ కన్నతల్లి హృదయం బద్దలవదూ?
మగవాడయిన తనే ఆ మాటకు పిగ్గిల్లి ఇంట ఓ క్షణం గడపలేక పలాయన మంత్రం పఠించాడే!
ఆ ఇంట్లో ఒంటరిగా పూర్ణ ఎంత తల్లడిల్లిపోతోందో?
అర్ధాంగి తలపుకి రాగానే పరమేశం నడక వేగం హెచ్చింది.
గంటకిందట ఇల్లు ఓ రణరంగంగా మారింది. పాతికేళ్ల నిరుద్యోగి తనయుడే పగవాడయ్యాడు.
అడ్డాలనాడు ముద్దూ మురిపాల పెరిగిన నేటి గడ్డాల కొడుకు విసిరిన వాక్బాణం పరమేశాన్ని నిశ్చేష్టుడిని చేసింది.
కరకు కత్తిలా గుండెలోకి కసుక్కున దిగిన ఆ మాటతో తన భార్య ముఖాన్నే చూడలేకపోయాడు పరమేశం.
అంతే!
ఒక్క ఊదుటున వీధిన పడ్డాడు. సందు గొందులు చూడకుండా ఊరంతా పిచ్చిగా తిరిగాడు.
అయినా పచ్చిగా ఉన్న గుండె గాయం అతడిని నిలవనీయకుండా చేస్తోంది.
ఒక్కసారి కన్నీటికి వరదొచ్చింది. అది చెక్కిలపై నెమ్మదిగా జారుతూ ఎదపై వర్షించింది.
అయినా కాలుతున్న గుండె ఆ కన్నీటికి ఆరలేదు.
ఇల్లు చేరుకున్నాడు పరమేశు. తన బడిపంతులు బతుకులో చెమటనీ రక్తాన్ని ఇటుక ముక్కలుగా పేర్చి కట్టుకున్న కలల గూడు అది. అది తాటాకు కమ్మలతో పర్ణశాలలా కనిపించినా ఓ తల్లిలా సేద తీరుస్తుంది ఎప్పుడూ.
వంటింట్లో ఎదురుపడింది పరమేశానికి పూర్ణ— కన్నీటి శిల్పంలా.
దాదాపు ముప్పయ్ ఏళ్ల కిందట తన కోసం ఏడడుగులు నడిచి అగ్ని ప్రదక్షిణం చేసి సహజీవనం కోరుతూ తనతో పాటు వచ్చేసింది.
'ఎన్ని వసంతాల్ని మరెన్నో శిశిరాల్ని కలసి పంచుకున్నాం ఇద్దరం. ఆమని పూచిన వెన్నెలల్ని ప్రేమని నింపిన కౌగిళ్లని కూడా పంచుకున్నాం—' అనుకున్నాడు పరమేశం గుండె నిండుగా.
మూడు ముళ్లు వేసిన తన కోసం ఇంటి పేరును సైతం మార్చుకొని.
తనువిచ్చి తరాన్ని పెంచిన ఆడది ఆమె.
"పూర్ణా!" నెమ్మదిగా పిలిచాడు పరమేశం.
ఎందుకో తెలీదుకాని అతడి గొంతు గాద్గదితమైంది ఆ క్షణంలో.
ఆమె చప్పున తలెత్తింది. ఆమె కళ్ల కింద నల్లటి చారలు. రెండు గంటల్లో ఎంత నీరసం ఆవహించిందామెను. మాట ఇరవై నిముషాల్లో ఎన్నేళ్ల మీదప[illegible]యో?
"పూర్ణా!" ఆమెను ఓదార్చేం[illegible]కు వచ్చిన పరమేశం చిత్రంగా ఓద[illegible]ప్ర కోసం ఎదురుచూస్తున్నట్లు నిలుచుండిపోయాడు.
ఆమె అతడికి మరింత చేరువైంది.
"ఏమండీ! మన బాబు, నా బంగారు తండ్రి. నా గారాల కొండ. ఏమన్నాడో విన్నారా?" ప్రశ్నించిందామె.



అతడేం మాట్లాడలేదు.
"వాడంతలేసి మాటలంటుంటే మౌనంగా ఎందుకూరుకున్నారండీ. చెంప బద్దలుకొడతారనుకుంటే!" అందామె ఆవేశంగా.
ఆ క్షణంలో ఆమె కంటిలోనే కాదు; గుండెకింద కూడా తడిని చూసాడు.
"వాడేం తప్పు మాటన్నాడు పూర్ణా. నిజమే కదా! అయినా వాడేం పరాయి వాడా? పసితనాన గుండెలమీద తంతే ముద్దిడి మరీ లాలించాం వాడిని.
అంతకన్నా పెద్ద తప్పు చేసాడా ఇప్పుడు" పరమేశం చెబుతున్నాడే కానీ తన మాటల్లో ఎక్కడో లోపం ఉందని తెలుస్తూనే ఉంది. అయినా పూర్ణ పంతులుగారి భార్య
శ్రద్ధగా వింటోంది. అయితే ఎంతదాముకుందామనుకున్నా ఆమె వెక్కిళ్లు దాగలేదు.
"పూర్ణా!" పరమేశం ఆమెని దగ్గరగా తీసుకున్నాడు.
అతడికి ముప్పయ్యేళ్ళ కిందటి తొలి కౌగిలి వెచ్చదనం జ్ఞాపకం రాలేదు.
రెండు గంటల కిందటి ఒక్కమాట గుర్తుకొచ్చింది.
అంతే!
ఒక్క ఊదుటున ఆమెని వదిలేశాడు.
"చూడు, పూర్ణా! పొరపాటున ఇలా మనిద్దరినీ వాడు చూసాడంటే మళ్లీ అనగలడు 'నయస్సు వచ్చినా వాంఛ చావలేదని' అన్నాడు పరమేశం.
అతడి చెవుల్లో కొడుకన్న మాటలే గింగుర్లు తిరుగుతున్నాయి.
"ఆవేశం ఆపుకోలేక పగలూ రాత్రి వాంఛ తీర్చుకుని కొడుకుని కనగానే సరిపోదు. వాడికో ఉద్యోగం చూపించాలి: పెళ్లి పెటాకులూ చేయాలి. ఛీ! ఛీ! ఇవేం చేయాలనే ఇంగితం లేనివాళ్లు నా తల్లిదండ్రులు".

* * *

అర్ధరాత్రి దాటింది.
అతని గుండెలో తమ్ముతున్న చీకటిలా ఆకాశం కూడా మబ్బు పట్టింది. అసలే అమావాస రోజులు. కనీసం ఒక్క నక్షత్ర కాంతి కూడా కానరావడం లేదు.
దూరంగా ఎక్కడో నక్క ఊళ. కీచురాళ్ల సంగీత ధ్వని.
మళ్లీ అదే మాట గుర్తుకొచ్చింది పరమేశానికి. కొడుకు ఉపయోగించిన పదం— 'వాంఛ' అది.
యవ్వనంలో ఉన్న తనయుడు తల్లిదండ్రుల దగ్గర కోర్కెల పత్రాలు సమర్పించడమే కాకుండా జన్మ ఇచ్చిన వారి దాంపత్యాన్ని కూడా అవహేళన చేసే స్థితికి ఈనాటి తరం ఇంతగా ఎదిగిపోయిందా?
"మంచి ప్రగతే!" మనసులోనే అభినందించాడు పరమేశం. బతుకలేని బడిపంతులు ఉద్యోగంలో చాలీచాలని జీతపురాళ్లను సేకరిస్తూ బాధ్యతల బండిని అతి బరువుగా ఈడూస్తూ ఉన్నంతలో ఓ చిన్న కుటీరం నిర్మించుకుని ఎప్పుడూ ఎవరినీ చేయిచాచి అడగని వాడిగా పరువుగా కుటుంబాన్ని గుంభనంగా నడుపుకొచ్చిన ఓ తండ్రికి తనయుడిచ్చే బహుమానం— బిరుదు – 'వాంఛాలోలుడని'.
పరమేశం కళ్లు ఎర్రబడ్డాయి. డిగ్రీ చదివించినా ఇంకా చాలదంటూ ఉద్యోగం చూడలేదని ఎకసెక్కెంచేసే తనయుడిని తలచుకుంటుంటే అతడికి అంతకంతకూ కడుపు రగిలిపోతోంది.
నన్నడిగుతున్నారా? నన్ను కనమని మిమ్మల్ని బతిమాలానా? అని ప్రశ్నించే కొడుకుంటే ఏ తండ్రి గుండె మాత్రం మండిపోదూ? ఆలోచిస్తున్నాడతడు. పిండానికి ఏ గండం లేకుండా ప్రాణ ప్రతిష్ఠ చేసిన తల్లి గర్భకోశాన్నే తనయుడు వాంఛా వేదికగా చిత్రీకరిస్తుంటే—
ఓ తల్లీ!
నీలోనూ వేశ్యా సంస్కృతికి వీక్షించే తరం వచ్చేసిందమ్మా!
ఆ ఒంటరి నిశీధిలో ఘోరున విలపిస్తున్నాడు పరమేశం.
అతడి గుండెనెవరో ఇనుప పిడికిలితో బిగించి నొక్కుతున్న అనుభూతి.
ఊపిరి పీలుస్తుంటే సన్నగా మొదలైన నొప్పి అంతకంతకూ తీవ్రమైన భావన.
"పూర్ణా!" బిగ్గరగా పిలిచాడు పరమేశం.
పక్క గదిలోనే పడుకున్న పూర్ణకు భర్త కంఠస్వరం వినిపించింది.
పరుగుపరుగున వచ్చిందామె.
"పూర్ణా! నీ స్వార్థ పరుడిని పూర్ణా! 'నాతి చరామి' అంటూ ప్రమాణం చేసి నీ ఖర్మకు నిన్నొదిలేసి నాదారిని చూసుకుంటున్నాను. ఇదిగో, ఇపుడే నిన్ను వదిలి వెళ్లిపోతున్నాను" అంటున్నాడు పరమేశం. అతని పెదవులు ఆగి ఆగి పలుకుతున్నాయి ఆ మాటలను.
"ఛ! ఛ! అవేం మాటలండీ. మీరుబతుకుతారు. నిండు నూరేళ్లు బతుకుతారు. మీముందే నేను పసుపు కుంకుమలతో వెళ్లిపోతానండి.. ఊరడిస్తూ అంటోంది పూర్ణ.
ఆ తర్వాత "బాబూ! ఒరేయ్, మీనాన్న గారిని చూడరా! నాకు భయంగా ఉంది" అంటూ గట్టిగా పిలచింది కొడుకు కిశోర్‌ని.
"ఏంటమ్మా! ఏమయింది" విసుగ్గా అడిగాడు.
"ఒరే, కన్నా! మీనాన్నని చూడరా! ఏదోలా అయిపోతున్నారు" అంటోంది పూర్ణ.
కిశోర్ పరుగు పరుగున వచ్చాడు తండ్రి దగ్గరికి.
"వద్దు... రావద్దు! నా దగ్గరికి రావద్దు" అంటున్నాడు పరమేశం.
ఇంతలో హఠాత్తుగా అతడి గొంతు పడిపోయింది. అయినా ఏదో చెప్పాలని విశ్వయత్నం చేస్తున్నాడతడు.
అతని జంట పెదవులు కదులుతున్నాయి
మాటే బయటకు రావడం లేదు.
మెల్లమెల్లగా మృత్యువు స్పృశించింది పరమేశాన్ని.
ఆ తర్వాత ఆ ఇంట్లో—
శ్మశాన నిశ్శబ్దం తాండవించింది.

* * *

పదిహేను రోజుల తర్వాత—
"బాబూ!" పిలచింది పూర్ణ.
ఎదురుగా వచ్చి నిలబడ్డాడు కిశోర్. నుదుట అరుణ రాగంతో కూడిన ఇల్లాలి తేజస్సుతో చూసిన తల్లిని ఇలా తెల్ల చీరలో చూడలేక తలొంచుకున్నాడతడు.
తండ్రి మరణం అతడిని తీవ్రంగా కలచివేసింది.
చిన్నతనంలో చిటికెనవేలు పట్టుకుని షికారు తిప్పిన తండ్రి—
గుండెలమీద ఎక్కించుకుని గోరుముద్దలు తినిపించిన తండ్రి లేడనేసరికి ఇంచుమించు అతనికి మతిపోయింది.
తనవల్లే ఇది జరిగిందా?
తల్లి కుంకుమ నేలరాలిపోవడానికి తనే కారణమా?
మథన పడిపోతున్నాడతడు. 'ఇంద్ర ధనుస్సులా మెరిసి మురిపించే గాజులు లేక అమ్మచేయి ఎంతబోసిపోయింది' బాధగా అనుకున్నాడు కిషోర్.
"బాబూ! ఈ ఇల్లు, ఈ ఇంట్లో ప్రతి ఇటుకలోనూ మీ నాన్న కనిపిస్తున్నారురా. ఈ ఇల్లొక్కటే మిగిలింది ఆయన తీపిగుర్తుగా, ఈ ఇంట్లో ఉంటే ఆయన నీడలో ఉన్నానన్న మనశ్శాంతి నాకు "చెబుతోందామె.
కిశోర్‌కి అర్థంకావడం లేదు. తండ్రిపోయిన తర్వాత ఈ పదిహేను రోజులు ఇద్దరి మధ్య మాటే లేదు. ఆ ఘోర సంఘటన తర్వాత ఏ మాట అంటే ఏ కొంప మునుగుతుందోనని తల్లడిల్లిపోతూనే ఉన్నాడు కిషోర్.
"బాబూ! చివరి కోరికగా ఒకటి కోరుతున్నాను. నా తర్వాత ఎలాగో ఈ ఇల్లు నీదే. అయితే నేబతికుండా ఈ ఇంట్లో నీవుండకురా!"
"అమ్మా!" అన్నాడతడు.
"అవును. ఈ పాటికి అర్థం చేసుకోవాలి. నీకా వయసొచ్చింది. ఎంత వయసొచ్చిందంటే అమ్మలో కూడా ఆడ తనాన్ని చూసేంత వయసొచ్చింది. అమ్మ కూడా 'వాంఛ' తీర్చుకొన్న తర్వాతే నన్ను కన్నది అనే ఆలోచన వచ్చేంత వయసొచ్చింది. నిజమే, బాబూ! ఈ సృష్టే అంత. అది నీకు ముమ్ముందు తెలుస్తుంది. దయచేసి ఈ ఇంటి నుంచి వెళ్లిపో" రెండు చేతులెత్తి నమస్కరించిందామె.
చిన్నమాట— * * *
గుండెను రెండుగా చీలుస్తుందని ఇప్పుడే తెలుసుకున్నాడతడు.
మాట విషం చిమ్మగలదని మాట మతిపోగొట్టగలదని తెలుసుకున్నాడు.
ఇప్పుడతని శరీరం నిండా ఘుడతలే. ముగ్గు బుట్టలాంటి తల.
అప్పుడు అతడు మరో విషయం కూడా తెలుసుకున్నాడు.
తన తండ్రి చివరి నిముషంలో ఏదో చెప్పాలనుకుని మాట పడిపోగా చెప్పలేకపోయిన సంగతేమిటో కూడా తెలుసుకున్నాడు.
ఆ మాట—
అదీ చిన్నదే.
'నీకూ పిల్లలు పుడితేనే తెలుస్తుంది. అసలు సంగతి' అన్నదే ఆ మాట. ●